సాక్షి పల్నాడు

ఆదివారం । 5 । నవంబర్ । 2023



రేణుకమ్మ ప్రతిష్ఠ మహోత్సవం

యడ్లపాడు: లింగారావుపాలెంలోని ఆలోకం ఇంటి పేరిట వారు తమ కులదైవం రేణుకమ్మ ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. శనివారం అమ్మ విగ్రహాన్ని ప్రతిష్ట గావించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 524.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిత్యాన్నదానానికి విరాళం

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి ఉషోదయ సూపర్ మార్కెట్ ప్రైవేట్ లిమిటెడ్ శనివారం రూ. 2.16 లక్షల విరాళం అందజేసింది.

న్యూస్‌రీల్

పందిళ్లపల్లి క్రీడాకారుడి ప్రతిభ

జాతీయ మారథాన్ పోటీల్లో మూడో స్థానం



వేటపాలెం: ఓపెన్ నేషనల్ మారథాన్ పోటీల్లో పందిళ్లపల్లి క్రీడాకారుడు ఆర్.ప్రదీప్‌నాయుడు మూడో స్థానం సాధించాడు. శనివారం కర్ణాటక రాష్ట్రంలోని ధార్వాడ్‌లో జాతీయ మారథాన్ పోటీల్లో భాగంగా 60 మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానం సాధించాడు. మొదటి స్థానం కేరళ, రెండో స్థానం తెలంగాణ సాధించింది. గత ఏడాది మార థాన్ పోటీల్లో 4-100 మీటర్ల పరుగు పందెం పోటీల్లో బంగారు పతకం సాధించాడు.

వాహనాల తనిఖీల్లో రూ.1.46 కోట్లు వసూలు

పట్నంబజారు : వాహనాల తనిఖీల్లో భాగంగా అక్టోబరు మాసానికి సంబంధించి నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించినట్లు డీటీసీ షేక్ కరీమ్ తెలిపారు. ఈమేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గుంటూరు జిల్లాకు సంబంధించి అక్టోబరు నెలలో వాహనాల తనిఖీల లక్ష్యం రూ.1.17 కోట్లుగా నిర్ణయించగా, రూ.1.46 కోట్లు సాధించినట్లు తెలిపారు. జిల్లాలోని 11 మంది ఎంవీఐలు సమష్టిగా కృషి చేసి 1,188 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.1.46 కోట్లు అపరాధ రుసు విధించి వసూలు చేసినట్లు వెల్లడించారు.

రూ.కోటి విలువైన భూమి ఆక్రమణ

- అనధికారికంగా భవన నిర్మాణం
- అడ్డుకున్న అధికారులు



మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు టిడ్కో నివాసాలకు అనుకుని సర్వే నంబర్ 224లో రూ.కోటి విలువైన పోరంబోకు భూమి ఆక్రమణకు గురికావడం స్థానికంగా సంచలనం సృష్టించింది. స్థానికంగా ఉండే ఓ పాస్టర్ 500 చదరపు గజాలకుపైగా ప్రభుత్వ డొంక పోరంబోకును ఆక్రమించడంతోపాటు అందులో అనధికారికంగా రూ.కోట్లు పెట్టి భవన నిర్మాణమూ మొదలుపెట్టాడు. ఈ విషయం శనివారం కార్పొరేషన్ అధికారుల దృష్టికి రావడంతో వారు వెంటనే అక్రమ కట్టడాన్ని నిలిపివేశారు. ఈ విషయమై నగర పాలక సంస్థ కమిషనర్‌ను వివరణ కోరగా స్థలం ఆక్రమణ, అందులో అనధికార కట్టడం పై తమ దృష్టికి వచ్చిన వెంటనే నిర్మాణాన్ని ఆపేశామని, కట్టడాన్ని తొలగించి ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకుని చట్టపరమైన చర్యలు చేపడతామని వివరించారు.

వైభవంగా ఆది దంపతుల పల్లకీ సేవ



విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శనివారం సాయంత్రం ఆది దంపతుల పల్లకీ సేవ అంగరంగ వైభవంగా సాగింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవ మూర్తులతో ఆలయం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేశారు. పల్లకీ సేవలో ఈవో కె.ఎస్.రామారావు, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.

నాద గంధర్వులు

- సుస్వరాల అనురాగం
- సంగీతార్చనలో సహధర్మచర్యం
- నాదస్వరంతో కట్టిపడేసే ఆదర్శ దంపతులు
- అసమాన రాగ సంపద వారి సొంతం
- వైఎస్సార్ లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న కాలేషాబీ, మహబూబ్ సుభాని దంపతులు

ఆబాలగోపాలాన్నీ మురిపించేది.. ఆసేతుహిమాచలాన్ని కదిలించేది.. సుస్వరాల జల్లులు కురిపించేది.. జనపథంతో కలిసి నర్తించేది.. కఠిన పాషాణాలనూ కరిగించేంది సంగీతం.. అందునా దక్షిణభారత కర్ణాటక సంగీతానికి విశిష్ట స్థానం ఉంది. ఇందులో నాదస్వరం అత్యంత మంగళకరమైనది. ఆలయాలు, మత, సామాజిక శుభ కార్యక్రమాల్లో ఇది తప్పనిసరి.. ఇంతటి ప్రాధాన్యమున్న నాద స్వరంతో అత్యంత మధురంగా శ్రావ్యంగా సరాగాలు పలికించే అసమాన ప్రతిభా సంపన్నులు షేక్ కాలేషాబీ, మహబూబ్ సుభాని దంపతులు. వీరిది స్వతహాగా చిలకలూరిపేట. తమిళనాడులోని శ్రీరంగంలో స్థిరపడ్డారు. ఈ పుణ్యదంపతులు ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గవర్నర్ ఎస్‌ఏ నజీర్ చేతుల మీదుగా వైఎస్సార్ లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డు అందుకోవడం తమకు ఎంతో గర్వకారణమని సంతోషం వెలిబుచ్చారు.



జయని'నాద'ం: షేక్ మహబూబ్ సుభాని

చిలకలూరిపేట: నాదస్వరానికి వన్నెలద్ది జనబాహుళ్యానికి దగ్గర చేసిన ఘనత చిలకలూరిపేట నాదస్వర విద్వాంసులకు దక్కుతోంది. దూదేకుల ముస్లింల సుమధుర శుభప్రద సన్నాయి వాద్యంతో ఎందరో దేవుళ్లు సుప్రభాత వేళ మేల్కొంటారు. సకల జనులను కటాక్షిస్తారు. నాదస్వరం సుప్రభాత సేవలకు ఆధ్యాత్మిక శోభ సంతరింపజేస్తోందనడంలో అతిశయోక్తి లేదు. చిలకలూరిపేట నాదస్వర విద్వాంసుల ఎనిమిదో తరం వారసులుగా షేక్ మహబూబ్ సుభాని, షేక్ కాలేషాబీ దంపతులు ఖ్యాతిగడించారు. దేశవిదేశాల్లో కచేరీలు చేస్తూ సంగీత ప్రియులను రసడోలికల్లో ఉర్రూతలూగిస్తున్నారు. వీరి కళను గౌరవించిన రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల ఒకటో తేదీన ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా డాక్టర్ వైఎస్సార్ లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డును అందజేసింది. ఈ సందర్భంగా రెండో తేదీన చిలకలూరిపేట షిరిడి సాయిబాబా మందిరంలో స్థానికులు ఆ పుణ్యదంపతులను ఘనంగా సత్కరించారు.

ఎనిమిది తరాలుగా..

ఎందరో నాదస్వర విద్యాంసులకు చిలకలూరిపేట పుట్టినిల్లు. నాదబ్రహ్మ, నాదస్వర గానకళా ప్రపూర్ణ బిరుదాంకితులు షేక్ చినపీర్‌సాహెబ్ ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించారు. ఈయన నివసించిన వీధికి ఇప్పటికీ ఆయన పేరే ఉంది. 1825 నుంచి చినపీర్ సాహెబ్ వంశీకులు నాదస్వర విద్వాంసులుగా రాణించారు. షేక్ చిన పీర్‌సాహెబ్ మనవడే(కూతురి కుమారుడు) షేక్ మహబూబ్ సుభాని. సుభాని భార్య కాలేషాబీ కూడా వరుసకు చినపీర్ సాహెబ్‌కు మనవరాలే. మహబూబ్ సుభాని ఏడేళ్ల వయస్సు నుంచే తండ్రి, తాత వద్ద నాదస్వరంలో సాధన చేశారు. కాలేషాబీ తొమ్మిదో ఏట నుంచే తన తండ్రి షేక్ జాన్‌సాహెబ్ వద్ద నాద విద్య అభ్యసించారు.

శ్రీరంగంలో స్థిరనివాసం

1978లో కాలేషాబీ, సుభాని పెళ్లి చేసుకున్నారు. అనంతరం కర్నూలు ప్రభుత్వ శారదా సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కె.చంద్రమౌళి వద్ద కొంతకాలం నాదస్వరం అభ్యసించారు. గానకళాప్రపూర్ణ, పద్మశ్రీ డాక్టర్ షేక్ చినమౌలానా సాహెబ్ వద్ద తంజావూర్ బాణీలో పదేళ్ల పాటు శిక్షణ పొందారు. తర్వాత తమిళనాడుకు వలస తరలివెళ్లారు. అక్కడ శ్రీరంగంలో స్థిరపడ్డారు. సుభాని, కాలేషాబీ దంపతులు ఇప్పటివరకు దేశ వ్యాప్తంగా వేలాది కచేరీలు ఇచ్చారు. 2005 మార్చి 5న రాష్ట్రపతి భవన్‌లో అప్పటి రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ముందు రెండు గంటల పాటు ఇచ్చిన కచేరీ మరిచిపోని అనుభూతి అని ఈ దంపతులు చెబుతారు. విదేశాల్లోనూ వీరు కచేరీలు ఇచ్చారు. తిరుమల, పలు గుడుల్లో నాదస్వరం వినిపించిన ఈ దంపతులు 2001 మార్చి 24 నుంచి శృంగేరి శారదా పీఠం ఆస్థాన విద్వాంసులుగా కొనసాగుతున్నారు. వీరి కొడుకు షేక్ ఫిరోజ్‌బాబు తల్లిదండ్రుల వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు. ఎంసీఏ చదివి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చినా వదిలి కచేరీల్లో పాల్గొంటున్నారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి డాక్టర్ వైఎస్సార్ లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు అందుకుంటున్న కాలేషాబీ, మహబూబ్ సుభాని దంపతులు చిత్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ విజయమ్మ



సుస్వరాలే 'సగం బలం' : నాదస్వరం వాద్యం చేస్తున్న షేక్ కాలేషాబీ

సండే స్పెషల్

వరించిన ముఖ్య పురస్కారాలివే..

ఈ దంపతులను తమిళనాడు ప్రభుత్వం 1994లో కలైమామణి అవార్డుతో సత్కరించింది.

- 2002లో నాదస్వర కళానిధి అవార్డు
- 2004లో అమెరికాలోని సౌత్ ఇండియన్ ఫైన్ ఆర్ట్స్ ఆఫ్ కాలిఫోర్నియా అవార్డు
- 2005లో సుబ్రమణ్యపిళ్లై శతాబ్ది అవార్డు
- 2008లో నాదస్వర చక్రవర్తి అవార్డు
- శ్రీలంకలో 2016లో నాదస్వర గానకళావారధి అవార్డు.
- 2017 మార్చి 29న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హంసకళారత్న అవార్డు ఇచ్చింది.
- 2020లో కేంద్రప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో ఈ దంపతులను సత్కరించింది.

గర్వకారణంగా భావిస్తున్నాం...



ప్రతిష్టాత్మక డాక్టర్ వైఎస్సార్ లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు అందుకోవడం ఎంతో గర్వకారణంగా భావిస్తున్నాం. పుట్టి పెరిగి, నాదస్వరం నేర్చిన రాష్ట్రంలో గొప్ప గుర్తింపుగా భావిస్తున్నాం. జీవితంలో ఎన్నో అవార్డులు పొందాం. పద్మశ్రీ అవార్డు, డాక్టర్ వైఎస్సార్ లైఫ్‌టైమ్ అవార్డు ఎంతో ప్రత్యేకమైనవి. మా కళను గుర్తించి అవార్డు అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– షేక్ కాలేషాబీ, మహబూబ్‌సుభాని, నాదస్వర విద్వాంసులు

స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ తనిఖీ

చేబ్రోలు: క్షేత్ర స్థాయిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శనివారం రాత్రి తనిఖీ చేశారు. చేబ్రోలులోని బీసీ బాలికల వసతి గృహాన్ని ప్రిన్సిపల్ సెక్రటరీ ఆకస్మిక తనిఖీ చేసి అక్కడ విద్యార్థులకు అందుతున్న మెనూ, రికార్డులను పరిశీలించారు. మౌలిక వసతుల గురించి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిధిలోని శేకూరు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. గ్రామంలోని విద్యార్థుల ఇంటికి వెళ్లి వారి అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌ల వాడకం, జగనన్న కిట్లు, నోట్‌బుక్స్, విద్యాబోధన తదితర అంశాల గురించి విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆయన వెంట స్థానిక ఎంఈవో ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



శేకూరులో విద్యార్థి ఇంటికి వెళ్ల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాష్

సందేశాత్మకంగా సాగిన 'నాన్న నేనొచ్చేస్తా'

ఏఎన్‌యూ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో తొలి ప్రదర్శన

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ గానగంధర్వ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ప్రదర్శించిన 'నాన్న నేనొచ్చేస్తా' నాటిక సందేశాత్మకంగా సాగింది. ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగంలోని నలుగురు విద్యార్థులు కథ రాసి, వారే దర్శకత్వం వహించిన ఈ ప్రదర్శన చేశారు. సామాజిక అంశాలపై సాగిన ఈ ప్రదర్శన యూనివర్సిటీ విద్యార్థులను ఆలోచింపజేసింది. ప్రేమ వివాహం చేసుకొని చిన్న చిన్న మనస్పర్థలతో భర్తను వదిలి పుట్టింటికి వచ్చిన ఒక అమ్మాయి ఇతివృత్తాన్ని, తల్లి మమకారంతో కూడిన అనుభవాన్ని, తండ్రి గారాభాన్ని కళ్లకు కట్టేలా ప్రదర్శించారు. తల్లి కూతురు మధ్య జరిగిన సంభాషణలు ప్రేక్షకులతో చప్పట్లు కొట్టించాయి. కూతురికి తల్లి నచ్చచెప్పే విధానం తన జీవితంలో జరిగిన ఘటనలను కూతురు తెలుసుకునే విధంగా చేసిన ప్రయత్నం మంచి ఫలితాన్ని ఇచ్చి కూతురు జీవితాన్ని నిలబెడుతుంది. ప్రదర్శనను తిలకించిన అనంతరం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ తన స్పందన తెలియజేస్తూ తన కుటుంబంలోని కొన్ని ఘట్టాలను గుర్తు చేసుకున్నారు. ఇలాంటి ప్రదర్శనలు నిరంతరం కొనసాగేలా ప్రత్యేక షెడ్యూల్‌ను రూపొందిస్తామని వీసీ తెలిపారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీహెచ్ స్వరూప రాణి, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగాధిపతి డాక్టర్ అనిత, విభాగ అధ్యాపకులు ప్రొఫెసర్ ఎల్‌వీ భూషణ్ తదితరులు ప్రదర్శనను వీక్షించారు.



నాన్న నేనొచ్చేస్తా నాటికలోని సన్నివేశం



క్రిస్మస్ కేక్ మిక్సింగ్

విజయవాడ : క్రిస్మస్ పండగను పురస్కరించుకుని నగరంలోని నోవాటెల్ హోటల్‌లో క్రిస్మస్ కేక్ మిక్సింగ్ సెలబ్రేషన్స్‌ను శనివారం నిర్వహించారు. బాదం, పిస్తా, జీడిపప్పు, కిస్మిస్, చెర్రీస్, వైన్, రమ్, విస్కీ, జిన్ వంటి వాటితో చేసిన మిశ్రమాన్ని 50 రోజులు నానబెట్టి క్రిస్మస్ ముందు రోజు కేక్ తయారు చేస్తారు.

9న విభిన్న ప్రతిభావంతులకు మెగా జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), సమర్ధనం ట్రస్ట్ ఫర్ డిసేబుల్డ్ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన గుంటూరు అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో విభిన్న ప్రతిభావంతులకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీపీఓ, డేటా ఎంట్రీ, ఈ-కామర్స్, రిటైల్, హాస్పిటాలిటీ ఉద్యోగాల భర్తీ కోసం 30 కంపెనీలు పాల్గొంటున్న జాబ్ మేళాకు జిల్లాకు చెందిన దివ్యాంగ యువతీ, యువకులు హాజరు కావాలని కోరారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హతల వారీగా 18 నుంచి 35 ఏళ్ల వయసు కలిగిన నిరుద్యోగ స్పీచ్, వినికిడి లోపం, తేలికపాటి ఆర్థోపెడిక్, శారీరక వైకల్యం కలిగిన అభ్యర్థులు బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్, పాస్‌పోర్ట్ ఫోటోలతో ఈనెల 9వ తేదీ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 6364867800 (801, 802, 803), 6303504995 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 4,610 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 202, బ్యాంక్ కెనాల్‌కు 1,206, తూర్పు కెనాల్‌కు 638, పశ్చిమ కెనాల్‌కు 215, నిజాంపట్నం కాలువకు 250, కొమ్మమూరు కాల్వకు 1,780 క్యూసెక్కులు విడుదల చేశారు.



క్లుప్తంగా

జాతీయ స్థాయి యోగా పోటీలకు ముగ్గురు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయులు

ఐలవరం(భట్టిప్రోలు): పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం జెడ్పీ హైస్కూల్‌లో ఈ నెల ఒకటి నుంచి 3వ తేదీ వరకు నిర్వహించిన 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ యోగా టోర్నమెంట్ కాంపిటీషన్ సెలక్షన్స్‌లో అండర్–14 బాలుర విభాగంలో భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుచున్న ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. 7వ తరగతి చదువుతున్న మాచర్ల జితేంద్రనాథ్ మణికంఠ, కొతరపు సంపత్, చింతక్రింద డోలా పూర్ణచంద్(స్టాండ్ బై)లు ఎంపికయ్యారు. వీరు పశ్చిమగోదావరి జిల్లా ఎస్‌డీజీఎఫ్‌ఐ ప్రెసిడెంట్ ఆర్‌వీ రమణ, సెక్రటరీ పీఎస్‌ఎన్ మల్లేశ్వరరావు చేతుల మీదుగా సర్టిఫికెట్లు, మెడల్స్ అందుకున్నారు. జాతీయ స్థాయికి ఐదుగురు ఎంపిక కాగా అందులో ముగ్గురు విద్యార్థులు బాపట్ల జిల్లా నుంచి ఎంపిక కావడం విశేషం. ప్రతిభ చూపిన విద్యార్థులు, శిక్షణ ఇచ్చిన పీడీ శ్రీనివాసరెడ్డిని ప్రధానోపాధ్యాయుడు మాచర్ల మోహన్‌రావు, ఎస్‌ఎంసీ చైర్మన్ పులిమి కుసుమకుమారి, సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు మురుగుడు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీలు మాచర్ల హేమసుందరరావు, అండె వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తాండవకృష్ణ, వేదాంతం బదరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయం

- జగన్‌కు జేజేలు పలికిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- ప్రభుత్వ విప్ పీఆర్కే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పీవీఆర్


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్

మాచర్ల: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా శుక్రవారం రాత్రి రెంటచింతల నుంచి మాచర్ల పట్టణం వరకు నిర్వహించిన కార్యక్రమానికి ప్రజానీకం, రైతులు, మహిళలు అన్నీ వర్గాల ప్రజలు వేల సంఖ్యలో హాజరై జయప్రదం చేయటం అభినందనీయమని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ యాత్రకు వచ్చిన రాష్ట్ర పార్టీ అనుబంధాల విభాగ సభ్యులు, రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, డిప్యూటీ సీఎం షేక్ అంజాద్ బాషా, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు, బాపట్ల ఎంపీ నంది సురేష్, ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, చంద్రగిరి ఏసురత్నం, పోతల సునీత, నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు మేరాజోత్ హనుమంతునాయక్‌తోపాటు అన్నీ సామాజిక వర్గాల నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి వర్గం ప్రజలు సామాజిక సాధికార బస్సు యాత్రలో పాల్గొని మేము జగన్ వెంటే అంటూ, మా నమ్మకం జగన్ అంటూ స్పష్టం చేయటం విశేషమన్నారు. రాబోయే రోజుల్లోనూ ఇదే సహకారాన్ని పార్టీకి అందించి నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేయాలని కోరారు.

నీతిపరులైన ఉద్యోగులకు త్వరలో సత్కారం

ఏసీబీ ఏఎస్పీ మహేంద్ర మత్తే


ర్యాలీలో ఏసీబీ ఏఎస్పీ మహేంద్ర, విద్యార్థులు

నగరంపాలెం: వచ్చే ఏడాది జరగనున్న విజిలెన్స్ అవగాహన వారోత్సవాల నాటికి ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తించే నీతిపరులైన ఉద్యోగిని గుర్తించి సత్కరిస్తామని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ఏఎస్పీ మహేంద్ర మత్తే అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా ఏసీబీ ఆధ్వర్యంలో శనివారం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో వర్క్‌షాప్ జరిగింది. ప్రభుత్వ శాఖల్లో నెలకొన్న అవినీతి, తద్వారా తలెత్తే పర్యవసానాలు, అవినీతిని కట్టడి చేసేందుకు అవలంబించాల్సిన అవశ్యకతపై ఏసీబీ ఏఎస్పీ మహేంద్ర మత్తే వివరించారు. తొలుత నగరంపాలెం జాషువా సెంటర్ నుంచి హిందూ కళాశాల కూడలి మీదగా సెంట్రల్ లైబ్రరీ వరకు ర్యాలీ నిర్వహించారు. 'అవినీతికి నో చెప్పండి.. దేశానికి అంకితంకండి' అనే నినాదంతో ర్యాలీ కొనసాగింది. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీలు సత్యానందం, ప్రతాప్ కుమార్, గుంటూరు రేంజ్ ఐజీ స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ డీఐజీ జి.శ్రీనివాసరావు, జిల్లా ఆర్టీఓ కరీం, జిల్లా ఆర్డీవో శ్రీకర్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ జిల్లా అధికారిణి శైలజా, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ గాయత్రి, ఏసీబీ సీఐలు రవిబాబు, నాగరాజు, అంజిబాబు, మన్మధరావు, సురేష్ బాబు, లక్ష్మారెడ్డి, జీఎంసీ, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, మైనింగ్, మెప్మా, డీఆర్‌డీఏ, వార్డు సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకులతో అన్ని వర్గాలకు సంక్షేమం

- ఏపీ చాంబర్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు లంకా రఘురామిరెడ్డి
- ఇన్నర్ రింగ్‌రోడ్డులో కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభం


బ్యాంక్ నూతన శాఖను ప్రారంబిస్తున్న లంకా రఘురామిరెడ్డి

గుంటూరు రూరల్: అన్ని తరగతుల వారి సంక్షేమం కోసం సహకార బ్యాంకులు స్థాపించటం జరిగిందని ఏపీ చాంబర్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు లంకా రఘురామిరెడ్డి తెలిపారు. శనివారం ఇన్నర్ రింగ్‌రోడ్డులో విశాఖ అక్కయ్యపాలెం ప్రధాన కార్యాలయంగా ఉన్న కనక మహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ 28వ శాఖను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార బ్యాంకులు దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయన్నారు. జాయింట్ రిజిస్ట్రార్ జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎం. వీరాచారి మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా ప్రజల అవసరాలకు సహకార బ్యాంకులు ఒక దిక్సూచీలా పని చేస్తున్నాయన్నారు. బ్యాంక్ చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ బ్యాంక్ స్థాపించి 24 ఏళ్లు పూర్తి చేసుకుని 25వ ఏట అడుగు పెడుతున్న సందర్భంగా రజతోత్సవాలు నిర్వహించుకుంటున్న సమయంలో గుంటూరులో 28వ శాఖను ప్రారంభించటం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం గుంటూరులో ప్రారంభించిన తమ శాఖకు ఖాతాదారులు తమవంతు సహకారాన్ని అందించి అభివృద్ధి బాటలో నడిపిస్తారని ఆశించారు. కార్యక్రమంలో గుంటూరు కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ బోనబోయిన శ్రీనివాసరావు, ఏలూరు కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ వై.గురవయ్య, గుంటూరు ఉమెన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్‌పర్సన్ కె.వి.సుజాత, ఏపీ టెక్స్‌టైల్స్ మిల్స్ అసోసియేషన్ వైస్ చైర్మన్ సామినేని కోటేశ్వరరావు, రాష్ట్ర అర్బన్ బ్యాంకుల సహకార సమాఖ్య అధ్యక్షుడు చిటూరి రవీంద్ర, బ్యాంక్ ముఖ్య కార్య నిర్వహణాధికారి కె.శ్యాంకిషోర్, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో మాతృమరణాలు తగ్గించాలి

డీఎండీహెచ్‌వో డాక్టర్ బి.రవి


మాట్లాడుతున్న డీఎండీహెచ్‌వో డాక్టర్ రవి

నరసరావుపేట: గర్భిణులలో ప్రమాదకర పరిస్థితులను ముందుగానే అంచనా వేసి క్షేత్రస్థాయి నుంచి రిఫరల్ చేసే స్పెషలిస్ట్ స్థాయి వరకు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని మాతృమరణాలు తగ్గించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. శనివారం జిల్లాస్థాయిలో హై రిస్క్ ప్రెగ్నెన్సీపై ఇంటిగ్రేటెడ్ హై రిస్క్ ప్రెగ్నెన్సీ మేనేజ్మెంట్ అండ్ ట్రాకింగ్ ప్రోగ్రామ్ రెండురోజుల శిక్షణను పల్నాడురోడ్డులోని కార్యాలయంలో ప్రారంభించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, సామాజిక ఆరోగ్య కేంద్రం, ఏరియా హాస్పిటల్‌లోని గైనకాలజిస్టులు శిక్షణకు హాజరయ్యారు. ఈ కార్యక్రమం రెండు విడతలుగా సోమవారం వరకు నిర్వహించనున్నారు. శిక్షణలో డాక్టర్ రవి మాట్లాడుతూ హైరిస్క్ ప్రెగ్నెన్సీపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫాలోఅప్ గురించి క్షుణ్ణంగా తెలియజేయడమే దీని ఉద్దేశమన్నారు. జిల్లాలోని అందరూ వైద్యులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని మాతృ మరణాలు తగ్గించేందుకు సహకరించాలని కోరారు. ఆర్మాన్ సంస్థ నుంచి మెడికల్ ట్రైనింగ్ ఆఫీసర్ డాక్టర్ నితీష, గైనకాలజిస్ట్ డాక్టర్ సుష్మ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ నాగ పద్మజ, బి సురేఖ, డీపీహెచ్‌ఎన్‌ఓ, మెడికల్ ఆఫీసర్స్, సిహెచ్, ఏహెచ్ గైనకాలజిస్టులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే గ్రామదర్శిని

హౌసింగ్ పీడీ పీవీఎస్ఆర్కే ప్రసాద్


నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ ప్రసాద్

చెరుకుపల్లి: ప్రజల కోసం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పరిశీలించి గ్రామాల్లో సమస్యలు తెలుసుకోవడమే గ్రామదర్శిని ముఖ్యోద్దేశమని బాపట్ల జిల్లా హౌసింగ్ పీడీ పీవీఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. మండలంలోని పొన్నపల్లి గ్రామంలో శనివారం గ్రామదర్శిని కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల పరిసరాలు, అంగన్‌వాడీ కేంద్రాన్ని, మధ్యాహ్న భోజన పథకాన్ని, పాఠశాల టాయిలెట్స్, గ్రామ సచివాలయం, ఘన వ్యర్థ పదార్థాల సంపద కేంద్రాన్ని, నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను, హెల్త్ సెంటర్, రక్షిత నీటి పథకం ట్యాంకును అధికారులతో కలసి పరిశీలించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్, సచివాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో చిన్నారులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పైనం రంగారెడ్డి, తహసీల్దార్ కె.వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఎంపీడీఓ మహాలక్ష్మి, ఎంఈఓ టి.నవీన్‌కుమార్, హౌసింగ్ ఏఈలు పద్మావతి, ఫిరోజ్‌ఖాన్, కార్యదర్శి జానకిరామయ్య, ఉపాధ్యాయులు, సచివాలయ, హెల్త్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు ఎస్ఐలు బదిలీ

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో పలువురు ఎస్ఐలను మరో ప్రాంతానికి బదిలీచేస్తూ జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. వినుకొండ పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న డి.చెన్నకేశవులును బండ్లమోటు పీఎస్‌కు బదిలీచేయగా, అక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న పి.రవికృష్ణను చిలకలూరిపేట రూరల్ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. చిలకలూరిపేట రూరల్ పీఎస్‌లో పనిచేస్తున్న ఎస్.రాజేష్‌ను డీఎస్‌బీకి బదిలీ చేయగా, అక్కడ పనిచేస్తున్న సీహెచ్.సురేష్‌ను చిలకలూరిపేట టౌన్ పీఎస్‌కు పంపారు. పెదకూరపాడు పీఎస్‌లో పనిచేస్తున్న బీవీ కృష్ణారావును పిడుగురాళ్ల ట్రాఫిక్ విధులకు బదిలీచేయగా, డీఎస్‌బీలో ఉన్న సీహెచ్. వీరాంజనేయులును డీసీఆర్‌బీకి బదిలీ చేశారు.



గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించి పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తాపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.